825) బృందావని

ప॥ పిలువరే కృష్ణుని పేరుకొని యింతటాను। పొలసి యారగించే పొద్దాయ నిపుడు॥

చ॥ వెన్నలారగించ బోయి వీధులలో దిరిగీనో। యెన్నరాని యమునలో యీదులాడేనో।
సన్నల సాందీపనితో చదువగ బోయినాడో। చిన్నవాడాకలి గొనె చెలులాల యిపుడు॥

చ॥ మగువల కాగిళ్ళ మఱచి నిద్దిరించీనో। సొగిసి యావుల గాచే చోట నున్నాడో।
యెగువ నుట్లకెక్కి యింతులకు జిక్కినాడో। సగము వేడికూరలు చల్లనాయ నిపుడు॥

చ॥ చెంది నెమలి చుంగుల సింగారించుకొనీనో। ఇందునే దేవరవలె ఇంటనున్నాడో।
అందపు శ్రీవేంకటేశు డాడివచ్చె నిదె వీడె। విందుల మాపొత్తుకు రా వేళాయ నిపుడు॥